క్లుప్తంగా

కోటి సంతకాల సేకరణకు తరలిన నేతలు

దొనకొండ: ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేస్తూ కూటమి ప్రభుత్వం జారీ చేసిన జీఓలకు నిరసనగా కోటి సంతకాల సేకరణకు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆదేశాల మేరకు మండల కన్వీనర్ కాకర్ల కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సుమారు 100 మంది దర్శి మండలం కొత్తరెడ్డిపాలెం గ్రామానికి గురువారం తరలి వెళ్లారు. తరలి వెళ్లిన వారిలో ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళి, మండల ఉపాధ్యక్షుడు భీమినేని వెంకటేశ్వర్లు, ఇండ్ల శ్రీనివాసరావు, నియోజకవర్గం బూత్ కమిటీ కన్వీనర్ కాలూరి రమణయ్య, జిల్లా యాక్టివిటీ సభ్యుడు బత్తుల వెంకట సుబ్బయ్య యాదవ్, ద్వారకచర్ల చెంచి రెడ్డి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు వినుకొండ కొండలరావు, గుమ్మా వెంకటేశ్వర్లు, ఎగ్గోని కృష్ణారెడ్డి, పులిమి శివ, కిన్నెర ప్రసాద్, చిలుకూరి నాగార్జునరెడ్డి, నూనె రవికుమార్, ముడమంచు మంగయ్య, షేక్ రసూల్, ముజాయిద్, మువ్వా రమణయ్య, పాపారావు పాల్గొన్నారు.

విద్యార్థులపై శ్రద్ధ చూపాలి



విద్యార్థితో చదివిస్తున్న ఎంఈఓ

దొనకొండ: ఉపాధ్యాయులు విద్యార్థులపై శ్రద్ధ చూపాలని మండల విద్యాధికారి–2 షేక్ అమీర్‌బాషా సూచించారు. స్థానిక ఉర్దూ పాఠశాలను ఆయన గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం పరిశీలించారు. తరగతి గదిలో విద్యార్థులతో మాట్లాడి సమాధానం రాబట్టుకున్నారు. చిన్నారులు చక్కగా చదువుకోవాలని ఆకాంక్షించారు. అతని వెంట సీఆర్‌పీలు ఉన్నారు.

ఈ–క్రాప్ నమోదు చేయడం లేదని ఆవేదన

పుల్లలచెరువు: మండలంలోని పలు గ్రామాల్లో ఈ–క్రాప్ నమోదు చేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పుల్లలచెరువుకు చెందిన రైతులు కొందరు మాట్లాడుతూ తాము సాగు చేసిన కంది పంటను ఇంత వరకు ఈ–క్రాప్ నమోదు చేయలేదన్నారు. పంట పండిన తర్వాత చాలా ఇబ్బందులు పడాల్సి వస్తోందని, ఆదేమని కార్యాలయంలో అడిగితే సిబ్బంది లేరనే సమాధానం వస్తోందని రైతులు వాపోతున్నారు. ఈ–క్రాప్ నమోదుకు ఈ నెల 25 చివరి తేదీ కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై అధికారులు స్పందించి ఈ–క్రాప్ నమోదుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

స్థలాలు పరిశీలించిన ఆర్డీఓ



అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ

కురిచేడు: దీపావళి పర్వదినం సందర్భంగా బాణసంచా షాపుల ఏర్పాటుకు స్థలాలను కనిగిరి ఆర్డీఓ కేశవర్ధన్‌రెడ్డి గురువారం పరిశీలించారు. స్థానిక ఏఎంసీ గోడౌన్ల ప్రాంగణంలో షాపుల ఏర్పాటుకు మార్కెట్ కమిటీ మోకాలు అడ్డు పెట్టింది. దానికోసం రాజకీయ డ్రామా ప్లే చేసి చివరకు కూటమి నాయకుల అనుమతితో అక్కడ ఏర్పాటు చేసే అవకాశం ఉందని ప్రచారం సాగుతోంది. ప్రత్యామ్నాయంగా దర్శి రోడ్డులోని హీరో షోరూం పక్కన ఖాళీ స్థలాన్ని పరిశీలించారు. కురిచేడుకు చెందిన వ్యక్తి బాణసంచా గోడౌన్ కం షాపు పర్మినెంట్‌గా ఏర్పాటు చేసుకునేందుకు దరఖాస్తు చేశారు. దానిపై స్థలాన్ని పరిశీలిస్తూ దీపావళి షాపులకు కూడా పరిశీలించినట్లు సమాచారం. అధికారులు, షాపులు ఏర్పాటు చేసే వ్యాపారులు పాల్గొన్నారు.

నేడు తర్లుపాడులో వైఎస్సార్ సీపీ రచ్చబండ

తర్లుపాడు: మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మండల కేంద్రమైన తర్లుపాడులో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో శుక్రవారం రచ్చబండ, కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు మురారి వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథిగా మాజీ శాసనసభ్యుడు, నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి అన్నా రాంబాబుతోపాటు పార్టీ రాష్ట్ర నాయకులు పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, ప్రజాస్వామ్యవాదులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని గురువారం ఓ ప్రకటనలో కోరారు.

జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలు పొందాలి

మార్కాపురం: జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలను ప్రజలు పొందాలని మార్కాపురం ఆర్టీఓ శ్రీచందన పేర్కొన్నారు. గురువారం జీఎస్టీ పన్నుల తగ్గింపుపై రవాణాశాఖ, కమర్షియల్ ట్యాక్స్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. జీఎస్టీ సంస్కరణలు దేశ ఆర్థిక చరిత్రలో మైలురాయిగా నిలిచిపోతాయని ఆర్టీఓ పేర్కొన్నారు. వ్యవసాయ పరికరాలు, మందులు, బైకులు, కార్లపై, మోటారు వెహికిల్స్‌పై భారీ స్థాయిలో జీఎస్టీ తగ్గిందని చెప్పారు. కార్యక్రమంలో సీటీఓ నరసింహారావు, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ మాధవరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వితంతువులను వంచిస్తున్న సర్కార్

- భర్తలను కోల్పోయి పుట్టెడు శోకంలో ఉన్నా పట్టించుకోని ప్రభుత్వం
- పింఛన్ మంజూరైనా నిధులు విదల్చని కూటమి పాలకులు
- ఆదరవు కోసం ఆశగా ఎదురు చూస్తున్న వితంతువులు



వితంతు పింఛన్ లబ్ధిదారుల జాబితా



ఎంపీడీఓకు వినతిపత్రం అందిస్తున్న మహిళ (ఫైల్)

పెద్దారవీడు:

కొత్త పింఛన్లు ఇస్తున్నామని ఊరూరా డంకా బజాయించి చెప్పుకుంటున్న కూటమి ప్రభుత్వం.. ఆచరణలో మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తోంది. మండలం పరిధిలో 12 మంది వితంతువులకు పింఛన్ మంజూరైనా బాధితులకు ఇంత వరకు నగదు అందించక పోవడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గొబ్బూరులో కాకి విశాలక్ష్మి, కంభంపాడులో కోలగోట్ల ఆదిలక్ష్మమ్మ, వినుకొండ అచ్చమ్మ, పోలిశెట్టి మద్దమ్మ, బెజవాడ కోటిలింగాలు, మద్దలకట్టలో దుద్దెల వెంకట సుబ్బమ్మ, దేవరాజుగట్టులో దుదెకుల కాశమ్మ, బట్టగిరి నాగమ్మ, తోకపల్లిలో సొంటి నారాయణమ్మలకు ఈ ఏడాది జూన్ 12వ తేదీన వితంతు పింఛన్ మంజూరైనట్లు మండల అధికారులు తెలిపారు. సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ దగ్గరకు వెళ్లి పింఛన్ డబ్బులు అడిగితే ఎంపీడీఓ దగ్గరకు వెళ్లాలని, ఇలా ఒకరిపై ఒకరు చెప్పుకోవడంతో వితంతువు మహిళలు కాళ్లరిగేలా తిరుగుతున్నా వారి నుంచి సరైన సమాధానం రావడం లేదు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయలేదని అధికారులు సాకులు చెప్పడంతో చేసేదేమీ లేక వృద్ధ మహిళలు మిన్నుకుండిపోయారు. అప్పటి నుంచి సచివాలయం, మండల పరిషత్ కార్యాలయాల చుట్టు ప్రదక్షిణలు చేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదని వాపోతున్నారు. మంజూరైన పింఛన్ డబ్బులు ఇవ్వాలని అధికారులను వేడుకుంటున్నా ఎటువంటి పురోగతి కనిపించడం లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి నెలా ఒకటో తేదీ రాగానే పింఛన్ డబ్బులు ఇస్తారా..అని ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నా ఫలితం లేదని మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధిక శాతం పేద, మధ్యతరగతి వితంతువులను కూటమి ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేస్తోంది.

పింఛన్ అందకుండా పచ్చ నేతల కుట్ర

రాజకీయ కక్షతో వితంతువు పింఛన్లు అందకుండా పచ్చనేతలు కుట్ర చేస్తున్నారు. అధికారం అండతో అధికారులను భయపెట్టి ఏ అసరాలేని వితంతు పింఛన్‌దారులను కన్నీళ్లు పెట్టిస్తున్నారు. గ్రామాల్లో భర్తను కోల్పోయి ఎటువంటి ఆసరా లేని వారికి కూటమి ప్రభుత్వం వంచనకు గురి చేస్తోందనే ఆరోపణలు బహిరంగంగా వినిపిస్తున్నాయి. మహిళలకు వితంతు పింఛన్‌లు ఇవ్వకుండా స్థానిక కూటమి నాయకులు అడ్డుకుంటున్నారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం నుంచి మండల పరిధిలో 12 మంది వితంతువులకు పింఛన్ మంజూరైనా వారికి పంపిణీ చేయలేదు. మండలంలో 12 మందే కాదు జిల్లాలో అనేక మంది వితంతువులు పింఛన్ కోసం ఎదురు చూస్తున్నారు. కుటుంబాన్ని పోషించే భర్త చనిపోతే ఆ మహిళకు ఆసరాగా ఉండాల్సిన ప్రభుత్వమే వారు అవస్థలు పడేలా చేస్తోంది. పింఛన్ మంజూరు విషయంలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అనుసరించిన విధానమే సరైందని, పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ మంజూరు చేసి వెంటనే డబ్బులు ఇంటి వద్దకు వచ్చి ఇచ్చేవారని మహిళలు గుర్తు చేశారు. రాజకీయ కక్షతో తమకు పింఛన్ పంపిణీ చేయకుండా నిలిపేయడం చాలా దుర్మార్గమని బాధితులు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి వచ్చే నెల 1వ తేదీన పింఛన్ డబ్బులు మంజూరు చేయాలని వితంతు మహిళలు కోరుతున్నారు.

పింఛన్ డబ్బులు మంజూరు చేయాలి:



ప్రభుత్వం నుంచి వితంతువు పింఛన్ మంజూరైనట్లు అధికారులు చెబుతున్నారు. అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసినా ఇదుగో అదుగో చెప్పడమేగానీ వితంతు పింఛన్ డబ్బులు మాత్రం ఇంత వరకు ఇవ్వలేదు. అధికారులు పింఛన్ డబ్బులు పంపిణీ చేస్తారని దాదాపు నాలుగు నెలల నుంచి ఎదురు చూస్తున్నా. ప్రభుత్వం స్పందించి మాలాంటి నిరుపేద మహిళలకు వితంతు పింఛన్ పంపిణీ చేయాలి.

సొంటి నారాయణమ్మ, వితంతు మహిళ, తోకపల్లి

ఎమ్మెల్యే బూచేపల్లి విస్తృత పర్యటన



శివకోటిరెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి



వెంకటేశ్వరరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తూ..

దర్శి: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన కొత్తరెడ్డిపాలెం వైఎస్సార్ సీపీ కార్యకర్త కోట శివకోటిరెడ్డిని, పాముకాటుకు గురై విశ్రాంతి తీసుకుంటున్న మేడగం నాగేంద్రమ్మను దర్శి ఎమ్మెల్యే, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి గురువారం వారి నివాసాలకు వెళ్లి పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. అనంతరం పొదిలి రోడ్డులోని శ్రీసాయికృష్ణ హాస్పిటల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరయ్యారు. జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డిలు రిబ్బన్ కత్తిరించి హాస్పటల్ ప్రారంభించారు. పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం మోటుపల్లిలో సీనియర్ నాయకులు కల్లూరి వెంకటేశ్వరరెడ్డి దశదినకర్మకు హాజరయ్యారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రమాదాల నిలయం.. కొండేపల్లి మార్గం



నాలుగు రోజుల క్రితం ప్రమాదానికి గురైై చెట్ల మధ్య ఉన్న ఆటో

- తరుచూ రోడ్డు ప్రమాదాలతో జనం బెంబేలు
- బిక్కుబిక్కుమంటూ విద్యార్థుల రాకపోకలు



రోడ్డుకు ఇరువైపులా చిల్లచెట్లు, పిచ్చిమొక్కలు

మార్కాపురం: మార్కాపురం నుంచి శివరాంపురం, కొండేపల్లి, అమ్మవారిపల్లి మీదుగా వెళ్లే రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. రోడ్డుకు ఇరువైపులా చిల్లచెట్లు, పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక తరచుగా ప్రమాదాలు సంభవిస్తున్నాయి. రోజూ కొండేపల్లి, అమ్మవారిపల్లి, శివరాంపురం గ్రామాల నుంచి సుమారు 100 మందికి పైగా విద్యార్థులు, 2 వేల మందికి పైగా ప్రజలు మార్కాపురం పట్టణానికి రాకపోకలు సాగిస్తుంటారు. ఈ మూడు గ్రామాలకు సంబంధించి సుమారు 50 ఆటోలు రోజూ మార్కాపురం పట్టణం నుంచి శివరాంపురం మీదుగా కొండేపల్లి వెళ్తుంటాయి. మరో 200 వరకు టూవీలర్లు ఇదే మార్గంలో తిరుగుతుంటాయి. సుమారు ఆరు కిలోమీటర్ల పొడవున ఉన్న ఈ రోడ్డులో మూలమలుపులను చిల్లచెట్లు మూసివేశాయి. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలు సక్రమంగా కనిపించక అయోమయానికి గురవుతున్నారు. నాలుగు రోజుల క్రితం ఆటో–టూవీలర్ పరస్పరం ఢీకొనడంతో శివరాంపురం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. రోడ్డు వెంట జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టాలని కోరుతూ అధికారులకు వినతిపత్రాలు సమర్పించినా స్పందించలేదని గ్రామ సర్పంచ్ గురుబ్రహ్మం ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా చెట్లు తొలగించి, ప్రమాదాలను నివారించాలని సర్పంచ్‌తోపాటు ఆయా గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్లాస్టిక్ వినియోగానికి స్వస్తి పలుకుదాం



పంచాయతీ కార్యదర్శితో మాట్లాడుతున్న డీపీఓ వెంకటేశ్వరరావు

కొనకనమిట్ల: ప్లాస్టిక్ వినియోగానికి ప్రతి ఒక్కరూ స్వస్తి పలికి అందుకనుగుణంగా గుడ్డ సంచులను వాడకంపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా పంచాయతీ అధికారి ఎం.వెంకటేశ్వరరావు మండల అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన మండలంలోని తువ్వపాడు పంచాయతీలో పర్యటించి గ్రామంలో చేయాల్సిన పలు పనులపై స్పందించి పంచాయతీ కార్యదర్శికి పలు సూచనలు, సలహాలు అందించారు. గ్రామంలో ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌ను మరమ్మతులు చేయించి వాడకంలోకి తేవాలని కార్యదర్శికి సూచించారు. సోర్స్ లెవెల్లో సెగ్రిగేషన్ చేస్తున్న విధానాన్ని పరిశీలించి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని క్లాప్‌మిత్రకు సూచించారు. స్వచ్ఛత సేవా కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ వద్దు.. గుడ్డ సంచులు ముద్దు అంటూ ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఎస్సీ కాలనీల్లో పర్యటించి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఈశ్వరమ్మ, ఈఓపీఆర్డీ శ్రీదేవి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

గొట్లగట్టులో నిత్యం ట్రాఫిక్



ట్రాఫిక్‌లో చిక్కుకుపోయిన వాహనాలు

కొనకనమిట్ల: ఒంగోలు–కర్నూలు హైవేపై కొనకనమిట్ల మండలం గొట్లగట్టు మేజర్ పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో ట్రాఫిక్ కష్టాలు వాహనదారులను తీవ్ర అసహనానికి గురి చేస్తున్నాయి. బస్టాండ్ సెంటర్‌లో ఇటీవల సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. అందులో భాగంగా ఒక వైపు కాంక్రీట్ పనులు చేశారు. మరో వైపు మార్జిన్ సక్రమంగా లేకపోవటం, రోడ్డుపై ఏర్పడిన గుంతలు వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్నాయి. వాహనాలు ఎదురుపడినప్పుడు అధిక సమయం నిలిచిపోతున్నాయి. దీనికి తోడు రోడ్డు మార్జిన్‌లో ఆటోలు, బైక్‌లు పార్కింగ్ చేస్తుండటంతో ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్డు చిత్తడిగా మారడంతో వాహనదారులతోపాటు స్థానికులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. త్వరగా రహదారి విస్తరణ పనులు పూర్తి చేసి రెండు వైపుల మార్జిన్‌లు సరిచేయాలని వాహనదారులు కోరుతున్నారు.

స్కాన్ చేసిన తర్వాతే మద్యం విక్రయించాలి



మద్యం బాటిల్‌ను స్కాన్ చేస్తున్న ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు

యర్రగొండపాలెం: ప్రభుత్వం గుర్తించిన మద్యం షాపుల్లో ప్రతి బాటిల్ సురక్ష యాప్ ద్వారా స్కాన్ చేసిన తర్వాతే విక్రయించాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సీఐ సీహెచ్ శ్రీనివాసులు ఆదేశించారు. గురువారం ఆ శాఖ పరిధిలోని పుల్లలచెరువు, త్రిపురాంతకం, యర్రగొండపాలెం మండలాల్లో ఉన్న షాపులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా షాపుల యజమానులతో మాట్లాడారు. తమ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మద్యం బాటిల్ అమ్మకాలు జరిపే సమయంలో స్కాన్ చేసి వినియోగదారుడికి ఎమ్మార్పీకే విక్రయించాలన్నారు. మద్యం బాటిల్ స్కాన్ చేయకుండా అమ్మకాలు జరిపినా, ఎమ్మార్పీకంటే ఎక్కువ ధరకు అమ్మినా, బెల్ట్ షాపులకు మద్యం సరఫరా చేసినా కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. షాపుల్లో మద్యం విక్రయాల రికార్డులను సీఐ తనిఖీ చేశారు.

వైద్యుల సమస్యలు పరిష్కరించాలి



నల్లబ్యాడ్జిలతో నిరసన వ్యక్తం చేస్తున్న వైద్య సిబ్బంది

పెద్దారవీడు: ప్రభుత్వం డాక్టర్ల సమస్యలను పరిష్కరించాలని యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు భరత్‌భూషణ్ అన్నారు. మండలంలోని చట్లమిట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎంపీఈహెచ్ఓ బి.సత్యమయ్య ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది విధులు నిర్వహిస్తూ నల్లబ్యాడ్జిలతో గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ 15 రోజుల నుంచి వైద్యశాలల్లో డాక్టర్లు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం ఇచ్చిన హామీలను నేరవేర్చాలని అడుగుతున్నారే తప్ప గొంతెమ్మ కోరికలు అడగడం లేదన్నారు. పీజీ సీట్లలో కోత విధించడంతో భవిష్యత్తులో పీహెచ్‌సీల్లో డాక్టర్లు పని చేయడానికి ముందుకు రావడం కష్టంగా ఉంటుందన్నారు. డాక్టర్లు సమ్మె చేయడంతో ప్రజలకు వైద్యం దూరమయ్యే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి ప్రజల ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని డాక్టర్లులు అడిగిన న్యాయమైన డిమాండ్‌లను నేరవేర్చాలని కోరారు. నిరసనలో ల్యాబ్ టెక్నీషియాన్ నవీన్‌కుమార్, సీహెచ్‌ఈఓలు కుమారి, చైతన్య, ఏఎన్‌ఎంలు అరుణజ్యోతి, నందిని, సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్లోరోసిస్‌పై విద్యార్థులకు అవగాహన



మాట్లాడుతున్న అనీల్‌కుమార్

తాళ్లూరు: స్థానిక ప్రైమరీ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో గురువారం కస్తూర్బా గాంధీ పాఠశాల, శివరాంపురం హైస్కూల్ విద్యార్థులకు ఫ్లోరోసిస్‌పై కన్సల్టెంట్ వి.అనీల్‌కుమార్ గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సురక్షమైన నీటిని తాగి ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటూ ఫ్లోరోసిస్ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఫ్లోరోసిస్‌తో కలిగే అనర్థాల గురించి తల్లిదండ్రులకు వివరించాలని కోరారు. ఫ్లోరోసిస్ బాధితులను గుర్తించి చికిత్స కోసం రిమ్స్‌కు పంపించాలన్నారు. పాఠశాలలో విద్యార్థులు తాగే, ఉపయోగించే నీటిని సేకరించి పరీక్షల కోసం ల్యాబ్‌కు తీసుకెళ్లినట్లు తెలిపారు. పీహెచ్‌ఎన్ వై.విజయమ్మ, హెచ్‌ఎంలు సుజిత, ఎస్పీ నాగిరెడ్డి, సూపర్‌వైజర్ రవి, ఫ్లోరోసిస్ ఎల్‌టీ అంజిరెడ్డి పాల్గొన్నారు.

నైపుణ్యాలు నేర్చుకుంటేనే ఉద్యోగాలు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కవిత

దర్శి: నైపుణ్యాలు నేర్చుకుంటేనే ఉద్యోగాల్లో స్థిరపడుతారని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏవీ కవిత అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చేరిన విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు గురువారం స్వాగత సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కవిత విద్యార్థులకు అమూల్యమైన సూచనలు చేశారు. డిగ్రీ చదివి పూర్తయిన తర్వాత కేవలం సర్టిఫికెట్ కాకుండా నైపుణ్యాలు నేర్చుకునేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకుని ప్రతి ఒక్కరూ లక్ష్యం పెట్టుకోవాలని చెప్పారు. దానికి అనుగుణంగా సిద్ధపడాలని వివరించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ప్రభుదాస్, సీపీడీసీ మెంబర్ జీవీ రత్నం, జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్.యోనాతస్, హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఎస్‌కే కాలేషావలి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



సన్మానం అందుకుంటున్న ఉపాధ్యాయులు

పుల్లలచెరువు: బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను స్థానిక జెడ్పీ పాఠశాల ఉపాధ్యాయులు గురువారం ఘనంగా సన్మానించారు. స్థానిక జెడ్పీ పాఠశాలలో ఉపాధ్యాయులుగా పని చేస్తున్న శ్రీనివాసరెడ్డి, కోటయ్య, లత బదిలీపై వెళ్తున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో హెచ్‌ఎం ప్రభూజీ అధ్యక్షతన సన్మాన సభ ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఈవో ఖాసిం మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బదిలీ అనేది సర్వసాధారణమ, పనిచేసిన ప్రాంతంలో విద్యార్థులకు చక్కటి బోధన చేసినప్పుడే ఉపాధ్యాయులకు నిజమైన గుర్తింపు ఉంటుందని, శ్రీనివాసరెడ్డి అనే ఉపాధ్యాయుడు వృత్తిని గౌరవంగా చూడటమే కాకుండా విద్యార్థులకు చదువులో ఇబ్బంది కలగకూడదని, ఉపాధ్యాయులు లేకున్నా రోజుకు నాలుగు సబ్జెక్టులు బోధించి నిజమైన ఉపాధ్యాయుడిగా గుర్తింపు తెచ్చుకోవడం అభినందనీయమన్నారు. ప్రతి ఉపాధ్యాయడు శ్రీనివాసరెడ్డిని ఆదర్శంగా తీసుకుని గుర్తింపు తెచ్చుకోవాలని కోరారు. కమిటీ చైర్మన్ కిష్టయ్య, గ్రామ పెద్దలు పి.ప్రసాద్, జి.భాస్కరరావు, విద్యాకమిటీ మాజీ చైర్మన్లు గురునాథం, శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంగమేశ్వరునికి ఇత్తడి తొడుగు బహూకరణ

కొనకనమిట్ల: మండలంలోని ఎదుర్రాళ్లపాడు సంగమేశ్వరస్వామి ఆలయంలో శివలింగానికి గ్రామానికి చెందిన బొరిగొర్ల కాశయ్య, సాయమ్మ దంపతులు ఇత్తడి తొడుగు బహూకరించినట్లు ఆలయ అర్చకుడు విజయకాంత్‌శర్మ తెలిపారు. గురువారం సంగమేశ్వరస్వామికి ఇత్తడి తొడుగు అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. దాతలు పట్టువస్త్రాలు సమర్పించి అర్చనలు, అభిషేకాలు చేశారు.